ప్రజాశక్తి

బుధవారం 25 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అర్జీలకు పరిష్కారమేదీ ?

- ఏళ్ల తరబడి కలెక్టరేట్‌కు బాధితులు రాక
- భూ సమస్యలే అధికం
- ఆక్రమణదారులు, మోసగాళ్లపై కానరాని ప్రభుత్వ చర్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పిజిఆర్‌ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. వచ్చిన అర్జీ మళ్లీ రాకూడదు' అని కలెక్టర్ విజయకృష్ణన్ తరుచూ చెబుతున్నారు.

'ఎన్ని సోమవారాలొచ్చినా సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. సమస్య పూర్తిగా వినకుండానే పంపిస్తున్నారు. మండలాల్లో పరిష్కరించడంలేదని ఇక్కడకొచ్చినా (కలెక్టరేట్‌కు) ఫలితం లేదు' అని అర్జీదారులంటున్నారు.

గత ప్రభుత్వంలో భూముల రీ సర్వే జరిగినా, కూటమి ప్రభుత్వంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నా పేద, మధ్య తరగతి రైతుల భూముల సమస్యలకు ఆశించిన, సంతృప్తికరమైన పరిష్కారం లభించడం లేదన్నది పైన అర్జీదారుల ఆవేదనను పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతుంది.

జిల్లాలో భూమిపై యాజమాన్యపు హక్కుల్లేనివారి పేర్లు ఆన్ లైన్‌లో ఎక్కిపోతున్నాయి. ఆక్రమణదారుల చేతుల్లోకి ప్రభుత్వ, ప్రయివేటు భూములు వెళ్లిపోతున్నాయి. ఒక స్థలం లేదా భూమి పలువురికి రిజిస్ట్రేషన్ చేసిన మోసగాళ్లు మొనగాళ్లుగా చెలామణీ అవుతున్నారు. వారికి కొంతమంది రెవెన్యూ అధికారులు సహకరించడం, మోసగాళ్లు, ఆక్రమణదారుల పట్ల పోలీసులు ఉదారంగా వ్యవహరించడం, తమకున్న ప్రత్యేకాధికారాలను భూ సమస్య పరిష్కారానికి ఉపయోగించకపోవడంతో భూ సమస్య అర్జీలు పెరుగుతూనే వున్నాయి. రాజకీయ, అధికార పలుకుబడి కలిగినవారి సమస్యల పట్ల పరుగులు తీసి, కిందివారిని పరుగులు తీయించి పరిష్కరిస్తున్న అధికార యంత్రాంగం పేదలు, ఏ పలుకుబడీలేని దీనుల సమస్యలను మిగతా 2లో..

పెద్దపల్లిలో ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

ఫార్మాలో భయం.. భయం

- ప్రమాద హెచ్చరిక పరికరాల ఏర్పాటుపై నిర్లక్ష్యం
- రక్షిత్‌లో లేని డిటెక్టర్లు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జెఎన్‌పిసి)లో చోటుచేసుకుంటున్న వరుస ప్రమాదాలు కార్మికులకు భయాందోళన కలిగిస్తున్నాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం అందరిలో నెలకొంది. రక్షిత్ ఫార్మాలో సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇద్దరి కార్మికుల అస్వస్థతకు యాజమాన్య తప్పిదమే కారణంగా కనిపిస్తోంది. హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు విడుదల కావడంతో అస్వస్థతకు గురైన ఆ ఇద్దరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఇతర ఫార్మా పరిశ్రమల ప్రమాదాల్లో బయటపడ్డ యాజమాన్య నిర్లక్ష్యవే రక్షిత్ ఫార్మాలోనూ కనిపించింది. ఫార్మా పరిశ్రమల్లో ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా, కార్మికుల ప్రాణాలు పోతున్నా, ఆస్పత్రుల పాలవుతున్నా పరిశ్రమాధిపతుల మనసు కరగడంలేదు. భద్రతా ప్రమాణాలు పాటించాలన్న ఆలోచన రావడంలేదు. 2020 జూన్ 29న సైనార్ లైఫ్ సైన్సెస్‌లో హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు లీకై ఇద్దరు కార్మికులు మృతిచెందగా, ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. రక్షిత్ ఫార్మాలో న్యూట్రలైజ్ చేసే జాయింట్ దగ్గర వాయువు లీకైవుంటుందని విచారణాధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వాస్తవానికి ఈ ప్రమాదం అతి సులువుగా నివారించదగినదే అయినప్పటికీ ఆ నివారణ చర్యలను యాజమాన్యం చేపట్టలేదు. వాయువులను గుర్తించి హెచ్చరించే ఫిక్స్‌డ్ డిటెక్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు ఈ ప్రమాదానికి గురయ్యారు.

హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు వాసన సులభంగా మిగతా 2లో..

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగ రాజారావు

ఏరియా ఆసుపత్రిలో గర్భిణి మృతి

▶ వార్త 8లో..

నగరంలో క్రిస్మస్ సందడి

▶ వార్త 2లో..

కూలి రేట్లు పెంచాలని 26 నుండి సమ్మె

▶ వార్త 5లో..

మళ్లీ మైనింగ్ ప్రకంపనలు

- 28న మరోసారి పబ్లిక్ హియరింగ్
- క్వార్ట్‌జైట్ తవ్వకాలను గతంలో మాదిరిగానే వ్యతిరేకిస్తామంటున్న కుశులవాడ పంచాయతీ ప్రజలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం కుశులవాడ పంచాయతీ పరిధిలోని తెల్ల కొండలోని క్వార్ట్‌జైట్‌ను తవ్వుకు పోవడానికి విఆర్ ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ గతంలో చేసిన ప్రయత్నాలు విఫలమైనా మళ్లీ తన ప్రయత్నాలను మొదలు పెట్టింది. ఇందుకు సంబంధించి మరోసారి ఈ నెల 28న పబ్లిక్ హియరింగ్‌ను అధికారులు నిర్వహిస్తున్నారు. దీంతో, ఈ పంచాయతీ పరిధిలోని ప్రజల్లో మళ్లీ మైనింగ్ ప్రకంపనలు ప్రారంభమయ్యాయి. ఈసారి కూడా పార్టీలకతీతంగా అడ్డుకొని తీరుతామని ప్రజలు తేల్చి చెప్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 28న తెల్లకొండపై క్వార్ట్‌జైట్ మైనింగ్ కోసం విఆర్ ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ తరపున అధికార యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఈ సందర్భంగా బ్లాస్టింగ్‌కు, డ్రిల్లింగ్‌కు మిగతా 2లో..

మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్న ప్రజలు (ఫైల్ ఫొటో)

చండీగఢ్ విద్యుత్ కార్మికులకు సంఘీభావం

డిస్కంల ప్రైవేటీకరణ ఆపాలి : సిఐటియు

చండీగఢ్ విద్యుత్ కార్మికుల పోరాటానికి విశాఖ కార్మికులు మద్దతు తెలిపారు. సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను వేగవంతం చేసిందని, చండీగఢ్‌లోని విద్యుత్ డిస్కంలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి పూనుకుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చండీగఢ్‌లో విద్యుత్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ పార్క్ హోటల్ వద్దనున్న ఎలక్ట్రిసిటీ ఎస్‌ఇ కార్యాలయం ఎదుట ఆయన నేతృత్వాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చండీఘర్ రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను కార్పొరేట్ సంస్థ అయిన ఎమినేంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీకి అమ్మడానికి ఈ నెల 4న చండీగఢ్ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్ అని, లాభాలు గడించే చండీగఢ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేటు వారికి అప్పజెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్రంలో కూడా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే విద్యుత్తును ప్రైవేటీకరణ చేసేందుకు రంగం సిద్ధమవుతోందన్నారు. అందులో భాగంగానే ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై మోయలేని భారాలను మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో మిగతా 2లో..

విశాఖ నగరంలోని ఎఇ కార్యాలయం వద్ద నినదిస్తున్న సిఐటియు నాయకులు

మొదటి పేజీ తరువాయి..

అర్జీలకు పరిష్కారమేదీ ?

మాత్రం పట్టించుకోవడం లేదు. ఆక్రమణదారులు, మోసగాళ్లను రక్షించేందుకు న్యాయపరమైన సమస్యలు, పరిమితులు, సాంకేతిక కారణాలు చెబుతూ సంబంధిత అధికారులు తప్పించుకొని పరోక్షంగా వారికి సహాయపడుతున్నారు.

భూ సమస్యలు ఇలా..

ఈ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన 246 అర్జీల్లో 156 భూ సంబధితమైనవే ఉన్నాయి. అంతకుముందు సోమవారం (16న) వచ్చిన 193 అర్జీల్లో 134 భూ సంబంధిత అర్జీలున్నాయి. వీటిని బట్టి జిల్లాలో భూ సమస్యల తీవ్రత ఇట్టే అర్ధమవుతుంది. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ అధికారులకు చేతులు రావడంలేదు. యలమంచిలి మండలం యర్రవరం రెవెన్యూ పెద్దపల్లిలో సర్వే నెంబరు 286లో 12.49 ఎకరాల చెరువులో కొంత స్థలం ఆక్రమణలకు గురికాగా, కొంత క్రయవిక్రయాలు జరుగుతున్నాయని అర్జీ ఇవ్వడానికి గ్రామస్తులు కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రభుత్వ భూములు కాపాడాలని ధర్నా చేశారు. సోమవారం కలెక్టరేట్‌కు అర్జీ ఇవ్వడానికి వచ్చిన ముగ్గురితో 'ప్రజాశక్తి' మాట్లాడగా వారంతా పరిష్కారంకాని భూ సంబంధిత సమస్యలను వివరించారు.

కశింకోట మండలం, నర్సింగబిల్లికి చెందిన ఈమె నూతిగట్లు శశికళ. ఆమె భర్త వెంకటరమణమూర్తి 2020 సెప్టెంబరులో చనిపోయాడు. అక్టోబర్‌లో ఏడెకరాల భూమిని వేరొకరు ఆన్‌లైన్‌లో తన పేరున మార్చుకోగలిగారు. శశికళకు మానసిక వికలాంగుడైన 30 ఏళ్ల కొడుకు వున్నాడు. ఆయనకు చెందిన ఈ భూమి కోసం ఆ తల్లి అప్పటి నుంచి తహశీల్దార్, కలెక్టరేట్‌కు తిరుగుతూనేవుంది. కోర్టును ఆశ్రయించింది. నడవలేని స్థితిలో న్యాయం కోసం వస్తున్నా ఎవరి మనసూ కరగలేదు. సమస్య పరిష్కరించలేదు.

సురవరపు దేవుడమ్మది దీన వ్యథ. ఆమెకు మాడుగుల మండలం గాదరాయిలో సర్వే నెంబరు 49/8లో 28 సెంట్లు జిరాయితీ భూమి వుంది. ఆర్అండ్‌బి రోడ్డుకు ఆనుకొని వున్న ఈ భూమిలో రోడ్డు కోసం ఏడు సెంట్లు ఆర్అండ్‌బి తీసుకుంది. ఆ ఏడు సెంట్లను ప్రయివేటు వ్యక్తి ఉపయోగించుకొని తన భూమిలో వెళ్లనీయడం లేదని దేవుడమ్మ కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చింది. అయినా ఆ సమస్య అలాగే వుండడంతో మళ్లీ అర్జీ ఇవ్వడానికి వచ్చింది.

ఈయన బుచ్చెయ్యపేటకు చెందిన తాటికొండ కాంతారావు. ఆయనకు వారసత్వంగా వచ్చిన సర్వే నెంబరు 106/3లో 4 సెంట్లు, 106/4లో 23 సెంట్లు, 108/17లో 14 సెంట్లు, 108/22లో 8 సెంట్లు మొత్తం 49 సెంట్లు భూమిని ఆన్‌లైన్‌లో వేరొకరు పేర నమోదు చేసుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకం కాంతారావు నాన్నమ్మ జల్లమ్మ పేర వుంది. ఆన్‌లైన్‌లో 1బిలో వేరొకరి పేరు వుంది. ఈ పేరు తొలగించి సరిచేయాలని 2022 నుంచి కాంతారావు తిరుగుతున్నాడు . సమస్య మాత్రం తీరలేదు.

అర్జీని అధ్యయనం చేసి సమస్యను పరిష్కరించే మార్గం అన్వేషించకపోవడం, తప్పు చేసిన, అందుకు సహకరిస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించకపోవడంతో బాధితులకు క్షోభ తప్పడంలేదు.

ఫార్మాలో భయం.. భయం

గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సగటున గాలిలో 0.03-0.05 పిపిఎం స్థాయిలో ప్రతి ఒక్కరు వాసన పసిగట్టగలరు. కొందరికి 0.0008 పిపిఎంల స్థాయిలో కూడా వాసన తెలుస్తుంది. గరిష్టంగా 100 పిపిఎంల వరకు వాసన గుర్తించగలరు. ఆ పైన వచ్చే వాసన తెలియక ప్రమాదాలు జరుగుతాయి. పనిలో గరిష్టంగా 15 నిమిషాల పాటు 15 పిపిఎంల హైడ్రోజన్ సల్ఫైడ్‌వున్న గాలి పీల్చినా ప్రమాదంవుండదు. ఆపైన పీల్చితే ప్రమాదం కానుంది. హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు విడుదలయ్యే పని ప్రదేశాలలో ఆ వాయువును గుర్తించే డిటెక్టర్లు ఏర్పాటు చేయాలి. 10 పిపిఎంలకు వాయువులు చేరగానే హెచ్చరించేలా పని ప్రదేశాల్లో ఆ డిటెక్టర్లను ఏర్పాటు చేయాల్సివుంది. కానీ ఇక్కడ యాజమాన్యం డిటెక్టర్లు ఏర్పాటు చేయలేదు.

తనిఖీల నిమిత్తం మాన్యువల్ (పోర్టబుల్) డిటెక్టర్లను వినియోగిస్తున్నారు తప్పితే ప్రమాద హెచ్చరికలు చేసే ఫిక్స్‌డ్ డిటెక్టర్లు ఏర్పాటు చేయలేదు. రియాక్టర్ల నుంచి వాయువులు విడుదలైవుంటే ప్రమాద తీవ్రత పెరిగివుండేది. రక్షిత్ ఫార్మాను ఏడాది క్రితం ఫ్యాక్టరీస్ అధికారులు తనిఖీ చేసినప్పుడు స్క్రబ్బర్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. వాటిని ఏర్పాటు చేసినా నిరంతరం అంతర్గత పర్యవేక్షణ చేస్తుండాలి. ఇది లోపించడంతో లీకేజీ జరగడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డిటెక్టర్లు ఏర్పాటువుంటే వాయువు లీకైనా ప్రమాద హెచ్చరికలతో కార్మికులు ప్రమాదం నుంచి తప్పించుకొనే వీలుంటుందని 'ప్రజల కోసం శాస్త్రవేత్తలు' ప్రతినిధి డాక్టర్ కె.బాబూరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఇది ఖరీదైన పరికరం కానప్పటికీ యాజమాన్యం ఏర్పాటు చేయలేదు.

చండీగఢ్ విద్యుత్ కార్మికులకు సంఘీభావం

సంఘం జిల్లా కార్యదర్శులు పి.మణి, ఎం.సుబ్బారావు, నాయకులు యుఎస్ఎన్.రాజు, పి.వెంకటరావు, జి.అప్పలరాజు, జి.పోలేశ్వరరావు, కె.కుమారి, అనపర్తి అప్పారావు, ఎం.చంటి పాల్గొన్నారు. **గాజువాక :** చండీగఢ్‌లో విద్యుత్ డిస్కంల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చినగంట్యాడ సబ్‌స్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు ఎం.రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎ.లోకేష్, కె.కిరీటం, కె.సంతోషం, గొలగాని అప్పారావు, సుబ్బన్న, పివైవి.రమణారావు, సుభద్ర పాల్గొన్నారు.

నగరంలో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని దాదాపు అన్ని చర్చిలు బుధవారం క్రిస్మస్ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి సిద్ధమైపోయాయి. ఇప్పటికే రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చిలను అలంకరించడంతో కాంతులీనుతున్నాయి. ఓల్డ్ టౌన్‌లో అనేక చారిత్రక ప్రసిద్ధ చర్చిలు ఉన్నాయి. 200 ఏళ్ళ చరిత్ర కలిగిన చర్చిలు రెండు ఉన్నాయి. ప్రధానంగా రోజ్ హిల్స్ చర్చితోపాటు జగదాంబ జంక్షన్‌లోని సెయింట్ ఫాల్స్ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, అల్లిపురంలోని కల్వరి బాప్టిస్ట్ చర్చి, సిరిపురం వాల్తేర్ క్లబ్‌ను అనుకొని ఉన్న సెయింట్ ఫాల్స్ పురాతన చర్చి విద్యుత్ దీపాల వెలుగులో సుందరంగా కనిపిస్తున్నాయి. క్రిస్మస్

కాంతులీనుతున్న చర్చిలు

వేడుకలకు అన్ని హంగులతో అవి సిద్ధమయ్యాయి. మరోవైపు క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో కొనుగోలు దారులతో మార్కెట్లు కిటకిటలాడు తున్నాయి. నగరంలో క్రిస్మస్‌కు సంబంధించిన స్టార్స్, విద్యుత్ లైట్లు, క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ డ్రెస్సెస్, టోపీలు, ఇలా ఎన్నో రకాల డెకరేటివ్ పరికరాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. వస్త్ర దుకాణాలు మంగళవారం క్రైస్తవులతో కిటకిటలాడాయి.

విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ఓ చర్చి

మళ్లీ మైనింగ్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి..) ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమంటూ ఈ పంచాయతీలోని కుశులవాడ, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం, గొల్లలపాలెం, ఇచ్ఛాపురం గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. పబ్లిక్ హియరింగ్‌ను పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున ఐక్యంగా వ్యతిరేకించారు. దీంతో, పబ్లిక్ హియరింగ్‌ను రద్దు చేస్తున్నట్లు వేదికపై జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అప్పట్లో ప్రకటించారు. మళ్లీ ఇదే సంస్థ గుట్టుచప్పుడు కాకుండా ఈ నెల 28న అదే స్థలంలో పబ్లిక్ హియరింగ్‌కు అనుమతులు తెచ్చుకుంది. సర్వే నెంబర్ 104లోగల 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న కుసులవాడలోని తెల్ల కొండ (ఎద్దు మెట్ట)పై క్వార్ట్జైట్ నిక్షేపాలు ఉన్నాయి. చాలా కఠినమైన ఈ శిలను వెలికి తీయడానికి బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ తప్పనిసరని నిపుణులు చెప్తున్నారు. ఈ కొండపై ఆధారపడి దళితులు, గొర్రెలు, మేకల పెంపకందారులు, గిరిజనులు ఆధారపడి బతుకుతున్నారు. తవ్వకాల వల్ల వీరు జీవనోపాధి కోల్పోతారు. మామిడి, జీడి తోటలు, పాకే స్వభావంగల వివిధ రకాల పువ్వుల తోటలు ఈ పరిధిలో ఉన్నాయి. తవ్వకాలతో వెలువడే కాలుష్యం వల్ల వీటికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తాగునీరు, వాతావరణం కాలుష్యం అవుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ హియరింగ్‌పై ఆనందపురం తహశీల్దార్‌ను వివరణ కోరగా తనకు దీనిపై ఇంతవరకూ సమాచారం లేదని మంగళవారం సాయంత్రం చెప్పారు. ఈ నెల 28న పబ్లిక్ హియరింగ్ జరుగుతుందని దండోరా వేయించాలని తనకు మంగళవారం అధికారుల నుంచి నోటీసు వచ్చిందని కుశులవాడ సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్ - 7 అనకాపల్లి పరిధిలో తుంపాల పంప్ హౌస్ నుంచి అనకాపల్లిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను లీక్ అయినందున బుధవారం అనకాపల్లి పరిసర ప్రాంతాలలో ప్రజలకు తాగునీటి అంతరాయం కలుగనుందని నీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

IN THE COURT OF THE A.P. CO-OPERATIVE TRIBUNAL AT VIJAYAWADA
O.P. NO. 6/2024

Between :
The Visakhapatnam Steel Plant contract Workers Mutually Aided Co-operative Thrift and Credit Society Ltd., ... Petitioner
AND
R2 : Koyyana Simhadri S/o Rama Murthy, D.No. MK-85, Vikas Nagar, Pedagartyada, Visakhapatnam- 530044.... Respondent R2

పై నెంబరు గల ఓ.పి.లో పిటీషనరు అయినటువంటి సొసైటీ వారు రెస్పాండెంటు అయినటువంటి మీపై రావలసిన బాకీ నిమిత్తం సదరు పై కోర్టులో ఓ.పి. వేసియున్నారు. సదరు శ్రీ కోర్టువారు ఎన్ని సమన్లు పంపిననూ అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్‌కు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున మీరు ది. 16-1-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొన గలరు. లేనిచో పై నెంబరు గల పిటీషన్‌ను మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 16-1-2025

ఎం.పరమేశ్వరరావు,
అడ్వకేట్,
మాచవరం డౌన్, విజయవాడ.
సెల్ : 9390606066

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No.31-31-21,
Sri Narayana Bhavanam, Sai Baba Street,
Dabagardens, Visakhapatnam-530020
MA. 2/2024 in O.A. No. 694 of 2019

BETWEEN:
Andhra Bank, Madhavadhara Branch, Visakhapatnam, rep. by it Power of Attorney Holder cum Manager ...Applicant
And
Kosuru Yougandhar & Another ....Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To.
1. **Kosuru Yougandhar** S/o. Sudhkar, Residing at D.No.9-28-3, Flat No 201, Laxminilayam, Balajinagar, VIP Road, Siripuram, Visakhapatnam-03
2. **Kosuru Denaga Deepthi** S/o, Sudhkar, Residing at D.No.9-28-3, Flat No 201, Laxminilayam, Balajinagar, VIP Road, Siripuram, Visakhapatnam-03

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1 to 2) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 am or at such time immediately thereafter according to the convenience of Tribunal on **02.01.2025** to answered the claim.

2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader/Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determine in your absence.

Given under my hand and seal of the Tribunal on this the 22nd day of October 2024 At Visakhapatnam.

Signature of The Officer Authorised
Debts Recovery Tribunal Visakhapatnam.
Assistant Registrar Debts Recovery Tribunal, Visakhapatnam

వేలము ప్రకటన
మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
ఓ.ఎస్.69/2014 ఈ.పి.261/2017

డి. హెచ్.ఆర్. పరవాడ సత్యనారాయణ
జె.డి.ఆర్. : సింగంశెట్టి అమ్మన్న @ బాబూరావు

పై నెంబరు అమలులో జె.డి.ఆర్.కు చెందిన ఈక్రింది షెడ్యూలు ఆస్తిపై ఈ నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తము పై కోర్టువారి ఎదుట ఈక్రింది షెడ్యూలు ఆస్తిను తేది. 02.01.2025 ఉదయం 10.30ని॥ లగాయతూ సాయంత్రం 5.00లోగా శ్రీకోర్టు వారి వలన బహిరంగంగా వేలము షరతులకు లోబడి వేలము కాబడును. కావున వేలంలో పాల్గొనదలచిన వారు పై తేదీన పై కోర్టు వారు ఎదుట హాజరై వేలంలో పాల్గొనవచ్చునని యిందుమూలంగా తెలియపరచడమైనది.

షెడ్యూలు

విశాఖపట్టణం జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా) నక్కపల్లి సబ్ రి॥జి॥ పాయకరావుపేట మండలం పెద్ద రామభద్రపురం గ్రామము సర్వే నెం.236/3 విస్తీర్ణము 1.04 సెంట్లు పల్లం భూమికి హద్దులు
తూర్పు : సింగంశెట్టి భాస్కరరావు భూమి
దక్షిణం : సింగంశెట్టి సూర్యారావు భూమి
పడమర : గొల్లపల్లి అరుణమ్మ భూమి
ఉత్తరం : పంట కాలువ
పై హద్దులు మధ్య జె.డి.ఆర్.కి హక్కు గల సమస్తమైన యిజిమెంటు మరియు వగైరా హక్కులలో
D.H.R : విలువ 200,000/-
అమీను విలువ 700,000/-
మార్కెట్ విలువ 4,68,000/-
పై కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పై బహిరంగ ప్రకటన

కీర్తి కొండలరావు
డి. హెచ్.ఆర్ తరపు అడ్వకేట్
పాయకరావుపేట
9848795958
యలమంచలిచిలి
20.12.2024

In the Honourable Court of the 2nd Addl. Senior Civil Judge of Visakhapatnam
EP 41/2017 in O.S. 1302/2012

Between :
వి. కనక మహాలక్ష్మీ మరియు
2 ఇతరులు **D.Hr`s**
మరియు :
కోరాడ ఆనందరావు **J.Dr**

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నెంబరు డిక్రీ అమలులో సొమ్ము రాబట్టే నిమిత్తము పైన ఉదహరించిన న్యాయ స్థానములో **తేది. 23-01-2025 ఉ॥ 10.30 ని॥ల నుండి సాయంత్రం 5.00గం॥ల** మధ్య కాలంలో బహిరంగముగా వేలం వేయబడును. కావున కావలసినవారు (వేలములో పాల్గొనువారు) ఆ సమయములో వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

వేలం ఆస్తి వివరములు

విశాఖపట్నం, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, సీతమ్మధార, అల్లూరి సీతారామరాజు నగర్, అసెస్‌మెంట్ నెం.100011/02436 (కొత్త అసెస్‌మెంట్ నెం.1086089773), టౌన్ సర్వే నెం.07 ప్రకారం విస్తీర్ణం 73 చ॥గ॥లు లేదా 61.03 చ॥మీ॥లు స్థలంలోని డోర్ నెం.18-122తో ఉన్న పూరిల్లు (ప్రస్తుతం సిమెంటు రేకుల ఇల్లు).

హద్దులు :
తూర్పు : కొండ
దక్షిణం : సుంకరి ఏకాశి గారి పూరిల్లు
పడమర : ముద్దాడ సన్యాసి గారి పూరిల్లు
ఉత్తరం : కొండ.

D.Hr Value: 7,50,000/-
Amin Value: 3,50,000/-
Hearing Date: 23.01.2025
Further Hearing: 30.01.2025

V.KOTESWARARAO
Advocate For D.Hr
Kancharapalem, Visakhapatnam
Cell : 9849589945

జాకీర్ హుస్సేన్‌కు ఘననివాళి

నివాళులర్పిస్తున్న గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రముఖ తబలా కళాకారుడు జాకీర్ హుస్సేన్‌కు గోపాలపట్నం కళాశాల పీఠం నివాళులర్పించింది. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ తబలా విద్వాంసుడిగా ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించి, భారతదేశ సాంస్కృతిక ఔన్నత్యాన్ని జాకీర్ హుస్సేన్ ఇనుమడింపజేశారనికొనియాడారు. పద్మవిభూషణ్ అవార్డు పొందిన ఏకైక తబలా విద్వాంసుడిగా, ప్రపంచ ప్రఖ్యాత గ్రేమీ అవార్డ్స్‌కు ఏడుసార్లు నామినేట్ అయ్యి, నాలుగు సార్లు గెలుచుకొని జన్మభూమికి వన్నెతెచ్చిన మహావ్యక్తి అని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా, ఫ్రాన్స్ దేశాల అత్యున్నత సంగీత పురస్కారాలు పొందిన అద్భుత ప్రతిభావంతుడని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బంగారు రాజు, గౌరవాధ్యక్షులు చందు సుబ్బారావు, గౌరవ సలహాదారులు తాండ్రంగి రామారావు, మిద్ది అప్పారావు, మాజీ అధ్యక్షులు గొరకల రామదాసు, లైబ్రేరియన్ నరసింహం, టి.రామచంద్రరావు, యల్లపు రమణారావు, భాస్కర్ పాణిగ్రాహి, అల్లు నారాయణరావు పాల్గొన్నారు.

జెజెసి ప్రిన్సిపల్‌గా రాంప్రసాద్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్‌గా పి రాంప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.. విజయనగరం జిల్లా నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకునిగా పనిచేస్తున్న రాంప్రసాద్‌ను ఉద్యోగోన్నతిపై ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా దుర్గా ప్రసాద్ వ్యవహరించారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన రాంప్రసాద్‌కు ఇన్చార్జి ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్, ఇతర అధ్యాపకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతించి, శుభాకాంక్షలు తెలిపారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి- సీతమ్మధార : తమను విధుల్లోకి తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు కోరారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సీతంపేటలోని అతని నివాసంలో కలిసి అభ్యర్థించారు. దీనిపై ఆ ఎమ్మెల్యే పల్లా స్పందిస్తూ, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరలో హెల్త్‌వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు సాయికిరణ్, మల్లేశ్వరరావు,కష్ణమోహన్, నాగ రాజు, లంక శ్రీను, వేణు బాబు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాలు

ప్రజాశక్తి- పద్మనాభం : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పూరిళ్లలో నివసిస్తున్న రెండు నిరుపేద కుటుంబాలకు మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన కొంతమంది దాతల ఆర్థిక సాయంతో మంగళవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. పూరిళ్లలోని పేద కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, టమోటా, తదితర నిత్యావసర సరుకులను అదే గ్రామానికి చెందిన వార్డు సభ్యులు మహంతి అప్పలరమణ (శ్రీను) అందజేశారు. కార్యక్రమంలో అలుగోలు బ్రహ్మం, వీరు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

ప్రజలపై విద్యుత్ భారాలు తగవు

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

టౌన్ కొత్తరోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరిట వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడాన్ని ఖండిస్తూ, అదానీకి అక్రమంగా కట్టబెట్టిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో టౌన్ కొత్త రోడ్డు దరి కరెంట్ ఆఫీస్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బాదుడే బాదుడు అని హేళన చేసిన చంద్రబాబు అదే బాదుడును ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు వచ్చినట్లయితే ప్రజలు అంధకారంలో బతకాల్సిందేనని ఆవేదన వెలుబుచ్చారు. వెంటనే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడకపోతే ప్రజలను ఐక్యం చేసి బషీర్‌బాగ్ పోరాటాన్ని తలపించేలా ఉద్యమాలు జరుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, కె.చంద్ర శేఖర్, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

పెందుర్తి : ట్రూఅప్, ఇంధన సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 95వ వార్డు శ్రామికనగర్‌లో నిరసన వ్యక్తం చేశారు.విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకురాలు బి. రమణి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు, ఛార్జీలు, పన్నుల భారాలకు తోడు ఇపుడు రూ.18వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపడం దుర్మార్గమన్నారు. ఐద్వా నాయకుల బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ, అదానికి రూ.కోట్లలో ఆర్థికప్రయోజనాన్ని చేకూర్చడం తప్ప ఇపుడు స్మార్ట్ మీటర్లు బిగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

పెందుర్తిలో సిపిఎం ఆధ్వర్యాన మహిళల నిరసన

ఉపాధ్యాయ సమస్యలపై ఆర్‌జెడికి వినతి

యుటిఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న ఆర్‌జెడి

ప్రజాశక్తి -మధురవాడ : అనకాపల్లి జిల్లాలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రాంతీయ విద్యా సంచాలకులు విజయభాస్కర్‌కు మంగళవారం యుటిఎఫ్ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ త్వరలో టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం అనే ఒక ప్రత్యేకమైన టైటిల్‌ను పాఠశాల విద్యా కమిషనర్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారని, దినిలో ఉపాధ్యాయుల సర్వీసు వివరాలను నింపాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో కాబట్టి ఉమ్మడి విశాఖ జిల్లాల డిఇఒల పరిధిలో అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల ఉపాధ్యాయుల డిఎస్‌సి సెలెక్షన్, ప్రమోషన్ల మెరిట్ కం రోస్టర్ లిస్టులను విశాఖ డిఇఒ వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. దీనిపై విశాఖ డిఇఒకు సూచించాలని విన్నవించారు.

దీనిపై ఆర్‌జెడి స్పందిస్తూ, 1994 నుంచి 2018 డిఎస్‌సి వరకు ఉపాధ్యాయుల సెలక్షన్ లిస్టులను అలాగే ప్రమోషన్ పొందిన లిస్టులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం యుటిఎఫ్ రూపొందించిన పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ఆర్‌జెడికి అందించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఒఎన్‌జి' ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం: తలసేమియా చిన్నారుల సహాయార్థం మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో ఒఎన్‌జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ అధినేత శివ దలాయి మాట్లాడుతూ, ఇప్పటివరకు 45 రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. స్థానిక ఎన్నారై ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

రక్తదానం చేస్తున్న దాతలు

'విశాఖ'కళాశాలలో ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి-పెందుర్తి :నరవలోని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజుల వర్క్‌షాప్ ముగిసింది. ఐఐటి రూర్కెలా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బెన్నీ కరుణాకర్ పాల్గొని ఛాలెంజస్ ఇన్ ది ఇన్వెస్ట్మెంట్ క్యాస్టింగ్ ప్రాసెస్' పై మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెకానికల్ ఇండస్ట్రీస్‌లో క్యాస్టింగ్ ప్రాముఖ్యతను క్యాస్టింగ్ ఎలాంటి పాత్ర పోషిస్తుందో వివరించారు. విద్యార్థులందరూ టెక్నికల్ నాలెడ్జిలు పెంపొందించుకుని. ప్రాక్టికల్ నాలెడ్జిపై ఆసక్తి కనబరిచి.మెరుగైన మెకానికల్ ఇంజనీర్లుగా తయారవ్వాలని సూచించారు. ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానికి అనుగుణంగా కష్టపడి చదవాలని సూచించారు. మంగళవారం వర్క్ షాప్‌లో 'ఎగ్జిక్యూటివ్ మైండ్స్ కన్సల్టింగ్ డైరెక్టర్ ఇంజనీరింగ్ విద్యార్థుల నుద్దేశించి' ఇన్సైట్స్ ఆన్ బిల్డింగ్ సక్సెస్‌ఫుల్ కెరీర్‌పై అవగాహన కల్పించారు, టెక్నికల్ నాలెడ్జ్‌తో పాటు ప్రతిఒక్కరూ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించు కోవాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలపై వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ, డాక్టర్ బెన్నీ కరుణాకరన్, తాడేపల్లి డేనియల్ ఆసీస్‌ను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివిపి.వర్మ, డీన్ అకడమిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి . డి.శాంతారావు, పాలిటెక్నికల్ ప్రిన్సిపల్ ప్రసాద్, వర్క్ షాప్ కన్వీనర్ డాక్టర్ కె.దయానా, విభాగాధిపతులు, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని బ్రాండిక్స్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్ -3లో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన ధూళి లోవరాజు అనే కార్మికుడిని మంగళవారం మధ్యాహ్నం ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టింది.కొణంపాలెం గ్రామం సమీపంలో రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో లోవరాజు మృతి చెందారు. దీనిపై అచ్యుతాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మృతి చెందిన లోవరాజు కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: బైక్‌పై తరలిస్తున్న 3.5కిలోల గంజాయి పట్టుకున్నామని కృష్ణదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మంగళవారం ఎఎల్.పురం రత్నంపేట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన చల్ల నాగశ్రీనివాస్ మణికంఠ, మామిడి వీరశివసాయి అనే ఇద్దరు నిందితులను గంజాయి తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి ఒక బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

చిట్టీల పేరుతో మోసం

- రూ.2 కోట్లకు టోకరా : నిందితులపై కేసు

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిట్టీల పేరుతో రూ 2 కోట్ల మేర వసూలు చేసి మోసం చేశారన్న బాధితుల ఫిర్యాదు మేరకు జివిఎంసి రెండో వార్డు వలందపేటకు చెందిన సరగడ ఉమ, ఒకటో వార్డు, తగరపువలస నగరపు వీధికి చెందిన షేక్ సమీర్‌పై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

సిఐ సుధాకర్ కథనం ప్రకారం, రెండో వార్డు వలందపేటకు చెందిన కొల్లి హరనాథ్‌రెడ్డితోపాటు అదే గ్రామానికి చెందిన పలువురు నుంచి ఉమ, షేక్ సమీర్‌లు చిట్టీల పేరుతో 2022 నుంచి సుమారు రూ 2 కోట్లు వసూలు చేశారు.ఇప్పటివరకు ఏ ఒక్కరికీ చిట్టీల తిరుగు మొత్తాన్ని చెల్లించలేదు. దీంతో బాధితులు హరినాథ్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు పోలీసులకు మంగళ వారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుల్లో యువతే అధికం

గీతంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : మితిమీరిన వేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు. దేశంలో ఏటా 4.5 లక్షల రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధిక శాతం 18-25 ఏళ్ల యువకులేనన్నారు. మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సులో కెజిహెచ్ ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజూరీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.అనిల్‌కుమార్, మెడికవర్ ఆసుపత్రి క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ మోహన్ మహారాజ్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదాల ప్రభావం బాధిత కుటుంబాలతోపాటు సమాజంపై పడుతోందన్నారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ అధ్యయనం ప్రకారం బైక్‌లపై వాహన చోదకుడితో పాటు వెనకున్న వారు హెల్మెట్ ధరించక పోవడం వల్ల 40 శాతం మంది తీవ్ర గాయాలపాలై కోలుకోలేకపోతున్నారన్నారు. ప్రమాదం జరిగిన తరువాత అత్యవసరం అనుకుంటే తప్ప బాధితులను అంబులెన్స్ వచ్చే వరకు కదప కూడదన్నారు. వెన్నెముక జాగ్రత్తగా ఉండేలా చూడాలని, బాధితులు కంగారుపడకుండా ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధితులను పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పకుండా తక్షణమే సమీప ఆసుపత్రుల్లో చేర్చి వైద్యం అందించేందుకు ఇబ్బందులేకుండా ప్రభుత్వం చట్టం చేసిందన్నారు.

గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ వాహనదారులు చట్టాలను, ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి, బాధ్యతతో వ్యవహరించాలన్నారు. గీతం ప్రాంగణంలో అందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా నిబంధన అమలు చేస్తున్నామన్నారు.. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, సెక్యూరిటీ డైరెక్టర్ బ్రిక్రమ్ పట్నాయక్, సెక్యూరిటీ హెడ్ రామాజనాయులు, వివిధ విభాగాల ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభ జయప్రదానికి బైక్ ర్యాలీలు

గాజువాకలో సిపిఎం బైక్ ర్యాలీ

పెందుర్తిలో ఈనెల 28,29తేదీల్లో నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పలు ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించారు. మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్‌షర్టు వాలంటీర్లు కవాతు నిర్వహించారు.

ప్రజాశక్తి- పెందుర్తి : ఈనెల 28 29 తేదీల్లో పెందుర్తి మండలం సుజాత నగర్‌లో నిర్వహిస్తున్న సిపిఎం విశాఖ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పెందుర్తి రైతుబజార్ నుంచి పెందుర్తి జంక్షన్, వేపగుంట, ఎన్ఎడి నుంచి పెట్రోల్ బంక్ వరకు బైక్‌యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పార్టీ జోన్ కార్యదర్శి బి జగన్ మాట్లాడుతూ. పెందుర్తి మండలం సుజాతనగర్‌లో మొట్టమొదటిసారి జరుగుతున్న సిపిఎం జిల్లా మహాసభల్లో భాగంగా 28న 10 గంటలకు పెందుర్తి జూనియర్ కాలేజీ నుంచి శ్రమజీవులు, కార్మికులతో మహాప్రదర్శన, అనంతరం సుజాతనగర్‌లో బహిరంగ సభ ఉంటుందని, అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర సీనియర్ నాయకులు సిహెచ్ నరసింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. బైక్‌ర్యాలీలో పార్టీ జోన్ కార్యదర్శి, బి రమణి, బి వెంకటరావు జోన్ నాయకులు జక్కన సత్యనారాయణ, అప్పలనాయుడు, ప్రభుదేవా, రాజు, శ్రీనివాసరావు, అన్న పూర్ణ, లక్ష్మి, ముత్యాలమ్మ అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

ములగాడ: సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం 62వ వార్డు దుర్గానగర గ్రౌండ్‌లో సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెడ్ షర్ట్ వాలంటీర్స్ కవాతును డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ కార్యదర్శి ఎస్ వాసు ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు, రామకృష్ణ, నరేష్, గణేషు, ఎల్.కృష్ణంరాజు, శంకరరావు, సురేష్ పాల్గొన్నారు.

గాజువాక.: సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ, గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ గంగవరం పోర్టు కాలుష్యం, రామచంద్ర నగర్ డంపింగ్ యార్డ్, గాజువాక ఇనాం భూసమస్య, విశాఖ డెయిరీ కాలుష్యం, కార్మికులకు కనీస వేతనాల అమలు తదితర అంశాలపై మహాసభలో చర్చించి, తీర్మానాలు, నిర్ణయాలు చేస్తారన్నారు. ర్యాలీలో సిపిఎం నేతలు ఎ.నూకేశ్వర రావు, బంగారు నాయుడు, కె.సంతోషం ఎన్ రాజేంద్ర ప్రసాద్, కామేశ్వరి, గొలగాని అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.

సీతమ్మధార : సిపిఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ అక్కయ్యపాలెంలో నిర్వహించిన బైక్‌ర్యాలీని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొట్టాఈశ్వరమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ మాట్లాడుతూ పేదల సమస్యలు పరిష్కారానికి ఎర్రజెండా నీడన సిపిఎం కృషి చేస్తోందన్నారు. ధరాభారం, ఛార్జీల మోత, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై మహా సభల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో సిపిఎం అక్కయ్య పాలెం ఏరియా నాయకులు యుఎస్ఎన్ రాజు, అప్పలరాజు, గౌరీష్, వెంకన్న, కన్నయ్య పాల్గొన్నారు.

పెందుర్తిలో బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న జగన్

ములగాడలో రెడ్‌షర్ట్ కవాతును ప్రారంభిస్తున్న వాసు

సీతమ్మధారలో సిపిఎం బైక్‌ర్యాలీ

రోడ్ల విస్తరణతో అభివృద్ధి : ఎమ్మెల్యే గంటా

కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రధాన రహదారితో పాటు బీచ్ రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్డు విస్తరణతో భీమిలి పట్టణ ముఖ చిత్రం మారనుందని, పట్టణ అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు మంగళవారం విస్తరణ చేయనున్న రోడ్లను జివిఎంసి ఒకటో జోన్ పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ,. రోడ్ల విస్తరణలో ఇళ్లు, ఇతర ఆస్తులు కోల్పోయిన వారికి ప్రభుత్వం తగిన నష్ట పరిహారం అందజేస్తుందన్నారు. ప్రధాన రహదారికి అనుకుని నిర్మాణంలో ఉన్న దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. భీమిలి మండలం అన్న వరం గ్రామంలో ప్రతిష్టాత్మక మైన ఒబెరాయ్, మే ఫెయిర్, తాజ్ గ్రూప్ రిసార్ట్‌లు రానున్నాయని తెలిపారు.

బీచ్ కోత నివారణకు శాశ్వత చర్యలు

భీమిలి బీచ్ కోతకు గురికాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే గంటా వెల్లడిచారు.కోతకు గురైన బీచ్ ప్రాంతాన్ని సందర్శించారు. బీచ్ కోత నివారణకు శాశ్వత చర్యలపై జిల్లా కలెక్టర్, విఎంఆర్‌డిఎ కమిషనర్, ఆర్అండ్‌బి ఎస్ఇ సహా సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు 2026 జూన్ నాటికి అందుబాటులోకి రానుండడంతో, అప్పటికి భీమిలి బీచ్ మీదుగా ప్రయాణించే వారికి ఆహ్లాదం కలిగించేలా బీచ్ ను తీర్చి దిద్దుతామన్నారు. పర్యటనలో ఆర్‌డిఒ కె సంగీత్ మాధుర్, హెచ్‌డిటి శ్రీను బాబు, పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్ ఉన్నారు

26న వంగవీటి విగ్రహ ప్రతిష్ట

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సేవా సంఘం సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరాంధ్ర రాధారంగా కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో 13వ వార్డు ఆరిలోవ కాలనీ, చివరి బస్‌స్టాపు వద్ద వంగవీటి మోహనరంగా విగ్రహ ప్రతిష్టకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సంఘం కార్యవర్గం తెలిపింది. మంగళవారం ఆరిలోవ కాలనీలో సంఘ కార్యవర్గ సభ్యులు పొత్రకండ ధర్మారావు, సీనియర్ అడ్వకేట్ మీసాల మురళీ మోహనరావు, ఏడువాక సన్యాసిరావు, మూది అప్పారావు మీడియాతో మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 26న ఉదయం ఆరిలోవ కాలనీ, చివరి బస్‌స్టాపు వద్ద విగ్రహ ప్రతిష్టను చేయనున్నట్టు తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు సాయం చేసిన ఏడువాక సన్యాసిరావు, స్థూపం ఏర్పాటుకు పొత్రకండ ధర్మారావు, మీసాల మురళీ మోహన్‌రావులకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి రాజకీయాలు, కులాలకు అతీతంగా రాజకీయ నాయకులు, అభిమానులు రానున్నట్టు తెలిపారు. సమావేశంలో కార్యవర్గం సభ్యులు మజ్జి రమణి, ఆబోతుల అప్పలనాయుడు, మదుపాడ సన్యాసిరావు, గిరడ మురళీ, కోటేశ్వర్రావు, బండి రాజా రమేష్, రావి సన్యాసిరావు, ప్రకాష్, అడ్డూరి చిన్నారావు పాల్గొన్నారు.

జూ క్యూరేటర్‌గా మంగమ్మ

ప్రజాశక్తి - ఆరిలోవ :ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల క్యూరేటర్‌గా జి.మంగమ్మకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉత్వర్వులు జారీ చేసారు. జూ క్యూరేటర్‌గా డాక్టర్ నందనీ సలారియా బదిలీపై వెళ్ళగా అప్పటి నుంచి జి.మంగమ్మను జూపార్కు అదనపు జూ క్యూరేటర్‌గా విధులు నిర్వర్తించారు.ఇక క్యూరేటర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వహించనున్నారు.

లాభాల బాటలో 'స్టీల్' త్రిఫ్ట్ సొసైటీ

ఘనంగా 13వ మహా జనసభ

సభలో మాట్లాడుతున్న సిఐటియు నేత శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : తెలుగు రాష్ట్రాల్లోనే అసంఘటిత కార్మికులతో మొట్టమొదటిసారిగా పొదుపు సహకార సంఘంగా 5400 మంది సభ్యులు, రూ.11 కోట్ల టర్నోవర్, రూ.20 లక్షల నికర లాభాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ లాభాలు, అభివృద్ధిబాటలో దూసుకుపోతోందనిసొసైటీ కార్యదర్శి పి.నారాయణరావు అన్నారు. మంగళవారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ 13వ మహాజనసభ ఎ.అప్పారావు అధ్యక్షతన దిగ్విజయంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ బ్యాంకులతో పోల్చుకుంటే అతి తక్కువ వడ్డీకే ఏటా వెయ్యి మంది సభ్యులకు రుణాలు మంజూరు చేస్తోందన్నారు. సభ్యుల సంక్షేమం, పిల్లలకు ప్రతిభా అవార్డులతోపాటు, సభ్యులు మరణిస్తే వారి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందించి సొసైటీ అండగా నిలుస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు సొసైటీలో చేరాలని, చేర్పించాలని విజ్ఞప్తి చేశారు
సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వనంగ సంస్థలను అమ్మేసి కార్మికులకు ద్రోహం తలపెడుతున్నాయని, ఇలాంటి సహకార సంఘాలను ప్రోత్సహించకుండా నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయన్నారు.కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఎ.శ్రీను, జివి.రమేష్ కుమార్, వై.శ్యామ్‌సుందర్, కె.సత్యవతి, ఎన్.శశిభూషణరావు, జి.శ్రీనివాసరావు, ఎస్.నాగలకృష్ణ, సొసైటీ ప్రతినిధులు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్, సిఐటియు అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎంవిఆర్ విద్యాసంస్థల కేలండర్ ఆవిష్కరణ

కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక ఎంవిఆర్ విద్యాసంస్థల నూతన సంవత్సర కేలండర్‌ను మంగళారం కాలేజీలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ, ఆర్థికంగా, అన్ని రంగాల్లోనూ విశాఖ ఎంతో పురోభివృద్ధి సాధిస్తోందని, విద్యార్థులు మంచి నైపుణ్యాలను మెరుగుపరచుకుంటే ఇక్కడే ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థిరపడవచ్చున్నారు.కళాశాలల చైర్మన్ డాక్టర్ వి.రామారావు మాట్లాడుతూ, ఏటా తమ విద్యాసంస్థల తరపున కేలండర్ రూపొందించి విడుదల చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజు పాల్గొన్నారు.

అనధికార పశు కబేళాపై కేసు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

నిర్వాహకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - ఆరిలోవ : అనధికారి పశుకబేళాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. వధకు సిద్ధంగా ఉన్న రెండు పశువులతోపాటు నిర్వాహకుడు మహ్మద్ ఇబ్రహీంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. 'నివాసాల్లోనే అనధికార పశు కబేళాలు' శీర్షికతో ఈనెల 23న సోమవారం ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి ఆరిలోవ పోలీసులు స్పందించారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆరిలోవ, ముస్తాఫా కాలనీలో నివాసంలో అనధికార పశు కబేళాపై ఎస్ఐ రామదాస్ సిబ్బందితో దాడులు చేశారు. ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో వధకు సిద్ధంగా ఉన్న రెండు పశువులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు మహ్మద్ ఇబ్రహీమ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భూముల మార్కెట్ విలువపై వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో భూముల మార్కెట్ విలువ పెంచకుండా తగు చర్యలు తీసుకోవాలని జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు కోరారు. మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో సన్న, చిన్న కారు రైతులు ఉన్నందున మార్కెట్ విలువ పెంచకుంటే ఉపయోగమన్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ స్పందిస్తూ, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని బదులిచ్చారు. సర్పంచ్ జివి నారాయణ ఉన్నారు.

విద్యార్థినులు కలలను సాకారం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

కెజిబివి విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ ముచ్చటిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-దేవరాపల్లి

విద్యార్థినులు బంగారు భవిష్యత్తు కోసం కలలు కని వాటిని సాకారం చేసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయంలో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులపై ప్రత్యేక అధికారి భువన మాధురిని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టారు. విద్యార్థినులు కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు తడుముకుండా సమాధానాలు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. భోజనం చేస్తూ టీచర్ల పనితీరు, తల్లిదండ్రుల రాకపోకలు, గత పేరెంట్స్ మీటింగ్‌లో జరిగిన విశేషాలు, భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారు వంటి విషయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ టాపర్లగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ తాగునీటి కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, నియోజకవర్గంలోని నాలుగు కేజీబీవీల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వాలాబులో అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

మండలంలోని వాలాబు పంచాయతీ శివారు గ్రామాలలో చేపడుతున్న లింక్ రోడ్ల నిర్మాణం, ఇతర అభివద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గిరిజన ప్రాంతాలలో జరుగుతున్న పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గిరిజనులతో కొంతసేపు ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆయేషా, డిఇఒ జి.అప్పారావునాయుడు, డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, మండల ప్రత్యేకాధికారి మంజులా వాణి, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంఇఒ బి.పడాల్ దాస్, రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రునాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, రైవాడ, వాలాబు సర్పంచులు చల్లా లక్ష్మి, పోడెల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు దివ్యశ్రీ ఎంపిక

దివ్యశ్రీ

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశ రాజధాని ఢిల్లీలో 2025 జనవరి 26న జరగనున్న 76వ భారత గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఆంధ్ర రాష్ట్రం తరఫున మునగపాక గ్రామానికి చెందిన విద్యార్థిని పోలిమేర దివ్యశ్రీ ఎంపికయ్యారు. ఆంధ్ర రాష్ట్రం తరఫున వివిధ విశ్వ విద్యాలయాలకు చెందిన జాతీయ సేవా పథకం నుండి ఎంపికైన విద్యార్థినుల్లో దివ్యశ్రీ అగ్రగామిగా ఎంపిక కావడం విశేషం. మహారాష్ట్రలో గత నవంబర్ 12 నుండి 21 వరకు జరిగిన పూర్వ గణతంత్ర శిబిరానికి ఆంధ్రప్రదేశ్ నుండి 44 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులలో ఒకరిగా దివ్యశ్రీ తుది ఎంపికయ్యారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దివ్యశ్రీ అక్కడ జరిగిన పరేడ్, పరుగు, క్రీడలు, సాంస్కృతిక, ఇంటర్వ్యూ వంటి అంశాలలో చురుగ్గా పాల్గొని భారతదేశ ప్రతిష్టాత్మక రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యారు. దివ్యశ్రీ ఈ నెల 30న ఢిల్లీకి చేరుకొని ముందస్తు శిక్షణ పొంది వచ్చే జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలు పరేడ్‌లో భాగస్వామ్యం వహిస్తారు. దివ్యశ్రీ తండ్రి పోలిమేర రాము విశ్రాంత సైనికో ఉద్యోగి కాగా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇటువంటి గుర్తింపును పొందగలిగానని దివ్యశ్రీ స్థానిక విలేకరులకు తెలిపారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్‌టిఆర్ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఎన్‌టిఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన టిడిపి నాయకులు గొర్లి శేఖర్ మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పీలా గోవింద సత్యనారాయణని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీలా గోవిందను శేఖర్ తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొద్దపు ప్రసాద్, బిఎస్ఎంకె జోగి నాయుడు, కర్రి బాబి, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వల్ప స్థాయిలో భూ విలువలు పెంపుదల

ప్రజాశక్తి- కె.కోటపాడు : గ్రామీణ ప్రాంతాల్లో భూములు, ఆస్తుల విలువ స్వల్పంగా పెరిగినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మధరావు తెలిపారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ల విలువ పెంపుదలపై ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద, వెబ్ సైట్లలో ప్రదర్శించడం జరిగిందన్నారు. నక్కపల్లి, చోడవరం, లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 20 నుండి 30 శాతం పెంచడం జరిగిందని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి జరగడం కొత్త ప్రాజెక్టులు ఆయా ప్రాంతాలకు రావడం వల్లే ఈ పెంపుదల చేశామన్నారు. మిగిలిన సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఐదు నుండి 10 శాతానికి పరిమితం చేయడం జరిగిందని చెప్పారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఇప్పటికే భూముల మార్కెట్ విలువలు భారీగా ఉండటంతో అక్కడ కొత్తగా పెంపు ప్రతిపాదనలు చేయలేదని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక సబ్ రిజిస్ట్రార్ కె సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

చట్ట పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు

మాట్లాడుతున్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

వినియోగదారుల చట్టం-2019 పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ సమావేశం హాలులో 'వినియోగదారుల రక్షణ చట్టం'పై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ-కామర్స్, ఈ-చెల్లింపులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనైతిక వ్యాపార ధోరణులు, తప్పుదోవ పట్టించే ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాధితులు వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. మోసపోయిన వినియోగదారులు నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ నంబర్ 1915, ఏపీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబర్ 1967లను సంప్రదించాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్‌ఒ) కనకమేడల వివిఎల్.నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వినియోగదారుల కమిషన్ల అధ్యక్షులు జి.తనూజరెడ్డి, జి.వెంకటేశ్వరి, ఔషధ నియంత్ర, పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె.విజయకుమార్, ఎఫ్ఎస్ఎస్ఏఐ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.సతీష్‌కుమార్, లీగల్ మెట్రాలజీ పరిశీలకులు డి.భాస్కరరావు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బి.త్రినాధరాజు, ఎన్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై జరిగిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లో విజేతలకు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి బహుమతులను అందజేశారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి హాజరై మాట్లాడారు. కామర్స్ విద్యార్థులు తప్పనిసరిగా వినియోగదారులు హక్కుల పైనా, వినియోగదారుల చట్టాల పైనా పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ఎం.గోవిందరావు, కామర్స్ లెక్చరర్ బి.లక్ష్మి, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, మ్యాథమెటిక్స్ అధ్యాపకులు ఎంవి.రామకృష్ణ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్స్‌కు గతేడాది చెరుకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు, కార్మికులకు జీతాల బకాయిలు క్రషింగ్‌కు ముందుగానే చెల్లించాలని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులకు కలిపి సుమారు రూ.15 కోట్ల మేర బకాయి ఉన్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం కంటే చెరకు మద్దతు ధర అధికంగా ఇస్తామని సర్వసభ్య సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, జనసేన నేత పివిఎస్ఎన్.రాజు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సుమారు రూ.9 కోట్లు మేరకు మొలాసిస్, కో- జనరేషన్ నిల్వలు ఉన్నప్పటికీ కార్మికులు కర్షకులకు బకాయిలు చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. గడిచిన మూడేళ్ళుగా చనిపోయిన సభ్య రైతులకు కనీసం నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో చెరకు రైతులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని 26 నుండి సమ్మె

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ర్యాలీ నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని ఈ నెల 26 నుండి జరుగు సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు పిలుపునిచ్చారు. అనకాపల్లి పట్టణం ముఠా కార్మిక సంఘం (సిఐటియు) విస్తృత సమావేశం మంగళవారం సంఘం భవనంలో జరిగింది. అనంతరం ముఠా కార్మికులు అనకాపల్లి మెయిన్ రోడ్డు మార్కెట్ ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ 30 నెలల క్రితం ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంపుపై ఒప్పందం జరిగిందని, ఒప్పంద కాలపరిమితి పూర్తయి 20 రోజులైందని తెలిపారు. కూలి రేట్లు పెంచాలని వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు, షాపు యజమానులకు తెలియజేసినా ఇప్పటివరకు సరైన నిర్ణయం చేయలేదన్నారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలో 300 శాతం పెరిగాయని, ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, విద్య, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉన్న కూలిరేట్లను 100శాతం పెంచాలని ముఠా కార్మిక సంఘం డిమాండ్ చేసిందని, వర్తక సంఘం 13 శాతానికి పెంచుతామని చెబుతున్నారని, దీనికి ఎట్టి పరిస్థితుల్లోనూ ముఠా కార్మిక సంఘం అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. మూడు దఫాలుగా జరిగిన చర్చల్లో పురోగతి లేకపోవడంతో ఈనెల 26 నుండి అనకాపల్లిలో ముఠా కార్మికులు లోడింగ్, అన్లోడింగ్ పనులను నిలుపుదల చేసి సమ్మె చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. తక్షణమే షాపు యజమానులు చర్చలు చేసి కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, బీశెట్టి అప్పారావు, అధ్యక్ష, కార్యదర్శులు కాపుశెట్టి అప్పారావు, సురేష్, నాయుడు, ఈశ్వరరావు, వి.సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రమేష్‌ను కలిసిన గంగాధర్

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి చోడవరం మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్ మంగళవారం అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్‌ను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు కార్పొరేషన్ పదవి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఎంపీని కలవడం జరిగిందని గంగాధర్ తెలిపారు. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధి కోసం మరిన్ని నిధులు తీసుకువచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఎంపీ రమేష్‌కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న నాగ గంగాధర్

నీటిలో ఉన్న వరి పనలను పరిశీలిస్తున్న రామసదాశివరావు

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

వరుస తుపానుల కారణంగా చేతికొచ్చిన పంట నేలపాలై అపారంగా నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాండ్రేగుల రామ సదాశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని హరిపాలెం గ్రామంలో వర్షాలకు మునిగిపోయి నష్టపోయిన వరి పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. వరి రైతులతో మాట్లాడి వారికి వచ్చిన కష్ట నష్టాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా చాలా నష్టపోయామని రైతులు కంటనీరు పెట్టుకొని తమ బాధను వెల్లబుచ్చారు. ప్రభుత్వం తమ నష్టాన్ని భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం సేకరించే ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున అదనంగా చెల్లించి ఆదుకోవాలని రైతు ఎల్లపు రామప్పారావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రామ సదాశివరావు మాట్లాడుతూ రైతుల మొర ప్రభుత్వం ఆలకించి క్షేత్రస్థాయిలో అధికారులను పర్యటించేలా ఏర్పాట్లు చేసి రైతుకు జరిగిన నష్టాన్ని పూడ్చాలని కోరారు.

పివికి నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రపంచ గర్వించదగ్గ మేధావుల్లో పీవీ నరసింహారావు ఒకరని అనకాపల్లి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గంటి రవికుమార్ అన్నారు. అనకాపల్లి న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో మంగళవారం మాజీ ప్రధానమంత్రి, తెలుగు తేజం కీర్తిశేషులు పివి నరసింహారావు వర్ధంతిని అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు దేశానికి చేసిన ఆర్థిక సంస్కరణలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వేట నిషేధ కాలపు పరిహారం అందించాలని ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం అందించాలని కోరుతూ మండలంలోని వాడపాలెం గ్రామంలో ఎపి మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, చింతకాయల శివాజీ, చోడిపిల్లి గంగరాజు మాట్లాడుతూ ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా ప్రభుత్వం వేట నిషేధ కాలం పాటిస్తూ, ఆ సమయంలో అర్హులైన మత్స్యకారులందరికీ పరిహారం అందిస్తుందని పేర్కొన్నారు. కాని వేట నిషేధ కాలం పూర్తయి ఎనిమిది నెలల గడుస్తున్నా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అర్హులైన మత్స్యకారులకు ఇవ్వాల్సిన రూ.20 వేలు చొప్పున పరిహారం నేటికీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కాలం పాటు పరిహారం ఇవ్వకపోతే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి ఒక్క మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత మత్స్యకారులు గరికిన అప్పారావు, సిహెచ్ పోతురాజు, ఎస్ ముసుల్రావు, చోడిపిల్లి అప్పలరాజు, కే వెంకటేష్, ఎస్ సత్తిబాబు, సిహెచ్ జగ్గా, జి నూకరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మత్స్య కార్మిక సంఘం నేత శివాజీ

అభిజిత్ మహిళా కార్మికులకు పరిహారం చెల్లించాలి

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అభిజిత్ అక్రమ లే ఆఫ్ ఒప్పందం ప్రకారం మెటల్ కొట్టే మహిళా కార్మికులకు పరిహారం చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మహిళా కార్మికులు మంగళవారం ర్యాలీ నిర్వహించిన తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ధర్నా చేశారు. అనంతరం తహశీల్దారు జివి జనార్ధన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ లేబర్ ఆఫీసర్ సమక్షంలో జరిగిన ఒప్పందం కార్మికులందరికీ అమలు చేస్తామని యాజమాన్యం అంగీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికుల పోరాటం ఫలితంగా వన్ మంత్ నోటీసుపై గ్రాడ్యుటీ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. నేడు మహిళా కార్మికులకు పరిహారం చెల్లించకుండా ఒప్పందాన్ని యాజమాన్యం ఉల్లంఘిస్తుందని పేర్కొన్నారు. బాలాజీ, టైమ్స్ శ్రీసాయి ఎంటర్ ప్రైజెస్ కాంట్రాక్టర్లు వద్ద పనిచేస్తున్న మెటల్ కొట్టే మహిళా కార్మికులకు నేటి వరకు పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్మికులకు పరిహారం చెల్లించేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగ కామేశ్వరి, రాజాన అమాజీ, సూరంపూడి తలుపులమ్మ, రాజాన చిన్నమ్మలు, లాలం లక్ష్మి, రెడ్డి నూక రత్నం, కరుకొండ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారు ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న అభిజిత్ మహిళా కార్మికులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పరవాడ ఎబిఎస్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ తాత వేషధారణలో విద్యార్థులందరికీ కేకులు, చాక్లెట్లు పంచుతూ సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపల్ ఎస్ దయా మాధురి, అధ్యాపకులు క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. జె.గణేష్ ప్రసాద్ రెడ్డి,డీన్ అకాడమీక్స్ ఎ.కృష్ణనాగ్, డిఎలోసిసి కో-ఆర్డినేటర్ షేక్ షబీనా అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెం ఏబిఎస్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శాంతా క్లాస్ వేషధారణ, క్రీస్తు జీవిత చరిత్ర నాటక రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు పీఎం కొండయ్య, ప్రిన్సిపల్ యు పద్మజ, డైరెక్టర్ దీపక్ పిల్లలను అభినందించారు.

భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, ఆట,పాటలు దేవదూతల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్కూల్ కరెస్పాండెంట్ కె శ్రీనివాస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు

గాజువాక : గాజువాక జోగవానిపాలెంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పర్వీన్ పండగ సాంప్రదాయాన్ని, సంస్కృతిని వివరించారు. విద్యార్థులు ఆటపాటలు, విభిన్న వేషధారణలతో సందడి చేశారు.

ముస్తాబైన చర్చిలు

కశింకోట : కశింకోట మండలంలో బుధవారం నాటి క్రిస్మస్ వేడుకలకు పలు చర్చిలు ముస్తాబయ్యాయి. కశింకోట, బయ్యవరం, తాళ్ళ పాలెం, కన్నురుపాలెం, నర్సింగబిల్లి గ్రామాల్లోని చర్చిల్లో పలు సేవా కార్యక్రమాలు చేశారు. చర్చిలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మ్యుటేషన్ పద్ధతి రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మ్యుటేషన్ పద్ధతిని వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మ్యుటేషన్ పద్ధతి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బంగారు బాతు లాంటిదని, భూమి ఎవరి సాగులో ఉన్నా డాక్యుమెంట్ ఉంటే రిజిస్ట్రేషన్ అయిపోతుందని, దానికి వన్‌బి రికార్డు కూడా సాయంత్రానికి వచ్చేస్తుందని పేర్కొన్నారు. దీని వలన నిజంగా భూమిలో ఉన్న సాగుదారునికి పూర్తిగా అన్యాయం జరుగుతుందని, ఈ పద్ధతి పూర్తిగా చట్ట విరుద్ధమైనదని తెలిపారు. దీని వలన పేదలు కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో జిల్లా వ్యాప్తంగా 25వేలు దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కారం చేయకుండా మళ్లీ రెండో సారి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం దేనికని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్లు ప్రతి సోమవారం రెవెన్యూతో పాటు ఇతర సమస్యలపై అధికారులకు ఆదేశాలిస్తున్నా ఒక్క సమస్య కూడా సక్రమంగా పరిష్కారం చేయడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కలెక్టర్ కార్యాలయంలో పోగుపడిన పబ్లిక్ గ్రీవెన్స్ అర్జీలు ఎన్ని పరిష్కారమయ్యాయో, ఎన్ని పరిష్కారం కావలసి ఉందో? ఎందుకు పరిష్కారం చేయలేకపోతున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రచారం యావతో ప్రభుత్వ ప్రజలను వెర్రి వెంగళప్పలను చేస్తుందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులోనూ, పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

రాగూర్ ప్రమాద మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని జెఎన్ ఫార్మాసిటీలో రాగూర్ లేబొరేటరీస్ ఫార్మా కంపెనీలో గతంలో విషవాయువు పీల్చి ప్రాణాల కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం పరవాడ తహశీల్దారు కార్యాలయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతులమీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అంబేద్కర్, జనసేన, టిడిపి మండల అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, వియ్యపు చిన్న, నాయకులు బుగిడి రామ గోవిందరావు, సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, కన్నూరు దేవి రమణ, చింతకాయల సుజాత ముత్యాలు, మెటూరు సన్యాసినాయుడు, మాజీ ఎంపిటిసి మాసరపు నాయుడు, ఫార్మా కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- కోటవురట్ల

ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనంతో రైతులు తీసుకోవలసిన మెలకువలపై మండల వ్యవసాయ అధికారి సరోజినీ మంగళవారం పాములవాక గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. వర్షాల నేపథ్యంలో కోసిన పంటలపై ఉప్పునీటిని పిచికారీ చేయాలని, కోసిన పంటను చిన్నచిన్న కుప్పలుగా వేసుకోవాలని సూచించారు. నీరు నిలవ ఉన్న ప్రాంతంలో ఊట కాలవలు ద్వారా నీటిని బయటికి పంపాలన్నారు. రైతులకు మినుము, పెసర విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడిసిన వరి ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా లీటర్ నీటికి 50 గ్రాములు చొప్పున ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. ఎంపిఈఓ సంతోష్ మాట్లాడుతూ మినుములు, పెసల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై లోక్‌సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిఎస్పీ ఆధ్వర్యాన అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా బిఎస్‌పి అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజలకు స్వేచ్ఛ సమానత్వం సామాజిక హక్కుల కోసం తన జీవితకాలం పోరాటం చేసిన మహనీయులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురించి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు మాట్లాడుతూ అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యత రహిత వ్యాఖ్యలు చేయడంపై అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలన్నారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు లంకా శ్రీనివాసరావు, సూరిశెట్టి రామచంద్రరావు, ముద్రా చంద్రశేఖర్, అనకాపల్లి శ్రీనివాసరావు, ఉడింగల నాగేంద్ర కుమార్, చాపల నూకరాజు, బండి అప్పారావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంటు సమావేశాలలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి తక్షణం బర్తరఫ్ చేయాలంటూ బిఎస్‌పి ఆధ్వర్యాన ఎల్‌ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెదపెంకి శివప్రసాదరావు, బోని కృష్ణ, కదిరి రాము, భాగం గోపాలరావు, భీమరశెట్టి విశ్వనాథం, ఎం.అన్వేష్ పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

నిరసన తెలుపుతున్న బిఎస్‌పి, దళిత నాయకులు

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

-జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్- పలుచోట్ల రెవెన్యూ సదస్సులు

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-కె.కోటపాడు

గ్రామాల్లో భూ వివాదాలను, అన్నదమ్ముల మధ్య ఏర్పడే భూ సమస్యలను అధికారుల వద్ద సామరస్యంగా పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మండలంలోని ఎ.భీమవరంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో మండల ప్రత్యేక అధికారి చైర్మన్‌గా, తహశీల్దారు, ఎంపిడీవో, పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీ ప్రతి శనివారం భూవివాదాలను పరిష్కరిస్తుందని తెలిపారు. గ్రామాల్లో చిన్న చిన్న భూ తగాదాలకు కోర్టుల వరకు వెళ్లడం డబ్బులు ఖర్చు, కాలయాపన వంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల వల్ల చిన్న చిన్న భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. అనంతరం గ్రామస్తుల నుండి భూ సమస్యలపై జిల్లా కలెక్టర్ వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సదస్సులో ఆర్డీవో ఆయేషా, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి, తహశీల్దార్ భాగ్యవతి, ఎంపీడీవో సాంబశివరావు, సర్పంచ్ తర్ర సన్యాసమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : రెవిన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. మండలంలోని దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో ఆమె రైతులు నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

పరవాడ : మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో మంగళవారం తహశీల్దార్ ఎస్‌వి అంబేద్కర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, డిటి సురేష్, సబ్ రిజిస్ట్రార్, సర్వేయర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్ళనరవ గ్రామంలో మంగళవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ సమస్యలపై 7 అర్జీలు అందినట్లు తహశీల్దారు బి.చిన్నకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, రాజాన పైడిరాజు, భూ రీసర్వే డిటి గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వో ఎం. గోవిందరావు, విలేజ్ సర్వేయర్లు లోకేష్, ఆసిప్ పాల్గొన్నారు.

నక్కపల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని తహసిల్దార్ నరసింహమూర్తి అన్నారు. మండలంలోని రేబాకలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రెవిన్యూ పరమైన సమస్యలపై అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, సర్వేయర్ పి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో పి.రామన్నపాలెం గ్రామంలో తహసిల్దారు తిరుమల బాబు, స్థానిక సర్పంచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రీ సర్వేలో సమస్యలను పరిష్కరించాలని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అనంతరం సదస్సుకు పలువురు రైతులు ఫిర్యాదులు అందజేశారు.

హాజరైన అధికారులు, నాయకులు

ఫిర్యాదులను పరిశీలించి త్వరిగగతిన పరిష్కరించాలని తహసీల్దార్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్ధవరావు, సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వో అనూష, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని తాళ్ల చీడికాడ రెవెన్యూ సదస్సు లింగంపేట సచివాలయం వద్ద, లింగందొరపాలెం రెవెన్యూ సదస్సు గింజర్తి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. తహశీల్దార్ పి.శ్రీనివాసరావు రైతుల భూసమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిటి చైనుల, ఆర్ఐ నాగరాజు, సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వో దుర్గ, సచివాలయ సర్వేయర్ కోమలి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని తహశీల్దారు జె.రమేష్ బాబు తెలిపారు. జంగులూరు, వెలంపాలెం గ్రామ రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ,ఇప్పటికే మండలంలో ఏడు గ్రామాల్లో రీ సర్వే జరిగిందన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలలో మరల రీసర్వే చేపట్టడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వజ్రపు కృష్ణకుమారి, యంపిటిసి కె.మంగ, మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

పెందుర్తి : మండలంలోని రాంపురం గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఆనంద్‌కుమార్ పాల్గొని, 50 అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. రైతుల తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ శిరీష, ఆర్ఐ ప్రసన్న లక్ష్మి, డిటి, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వర్మీ కంపోస్టు విక్రయాలు చేపట్టాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:వర్మీ కంపోస్టు విక్రయాలు చేపట్టి, పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. మండలంలోని వేంపాడులో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వర్మి కంపోస్టు సిద్ధంగా ఉండడంతో, అవసరమైన రైతులకు విక్రయించాలన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. ఆధార్ కేంద్రం, ఈ సర్వీసెస్, సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. పలు అంశాలపై రివ్యూ నిర్వహించారు. పిఎసిఎస్ కు చెందిన రైతులకు ఈ కేవైసీ చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈవోపీఆర్డి ఎం.శ్రీను, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్పంచ్‌ను అభినందిస్తున్న గంటా

సర్పంచ్‌కు గంటా అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడి పంచాయతీకి సమృద్ధి నీటి సరఫరా విభాగంలో జాతీయ అవార్డు రావడంతో సర్పంచ్ రెడ్డి వరహాలు బాబును భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అభినందించారు. న్యాయంపూడి పంచాయతీకి జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో దీన్ దయాల్ ఉపదయా పంచాయితీ సతత్ వికాస్ పురస్కార్ అవార్డు దక్కింది. ఈ మేరకు విశాఖలో గంటాను మంగళవారం సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు సర్పంచ్ వరహాలు బాబు తో పాటు, అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, విష్ణు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి రాజీవ్ నగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ ఎంపీ సీఎం రమేష్ కు బిజెపి మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు అందజేశారు. అనకాపల్లిలో మంగళవారం ఎంపీ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 12 సంవత్సరాల క్రితం కాలనీలో సుమారుగా 350 కుటుంబాలు ఇళ్లను నిర్మించుకొని నివాసం ఉంటున్నారన్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు శ్రీరంగ రమేష్, పోలినాటి నానాజీ, వేముల వెంకటరమణ, కనకరాజు, జోగినాయుడు, పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న నేతలు

వైభవంగా వెంకన్న తిరు వీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీనివాసుడు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను హంస వాహనం పైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలోనూ వేయింపజేసి ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో గ్రామ తిరువీధి సేవను వైభవంగా నిర్వహించారు.ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఊరేగిస్తున్న భక్తులు

53 వేల ఎకరాలకు సాగునీరు

స్పీకర్ అయ్యన్న పాత్రుడు

ప్రజాశక్తి -నాతవరం:మండలంలోని సరుగుడు సుందరకోట పంచాయతీలో రోడ్డు నిర్మాణానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు 2.05 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామాల్లో సౌరశక్తి ఆధారంగా తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. నాతవరం మండలంలో గత ఆరు నెలల్లో రూ. 26.80 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో తాండవ రిజర్వాయర్ గేట్లు, కాలువల మరమ్మత్తుల కోసం రూ. 1.80 కోట్ల నిధులు కేటాయించామన్నారు. 53 వేల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యమని తెలిపారు. పోలవరం నీటిని తాండవకు తరలించేందుకు ప్రణాళికలు చేయనున్నట్లు వివరించారు.మండలంలోని మూడు హాస్టళ్లకు రూ. 38 లక్షల వ్యయంతో మరమ్మత్తులు చేస్తుండటంతో పాటు విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదనపు

శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

కరెంటు స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని స్పీకర్ తెలిపారు. సరుగుడు జలపాతాన్ని పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ, నాతవరం ఎమ్మార్వో వేణుగోపాల్, తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి రమణతో పాటు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని జె.బి. పురం రైతు సేవా కేంద్రాన్ని ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.ప్రస్తుతం జరుగుతున్న 21వ పశు గణన కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఎన్ని ఇళ్లకు సర్వే పూర్తి చేశారు, ఎన్ని ఇళ్లకు సర్వే చేయాలని అడిగి తెలుసుకున్నారు. గడ్డి పెంపకం పథకం గురించి రైతులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పశు సంవర్ధక సహాయకురాలు మాధవి పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న చిట్టినాయుడు

మాట్లాడుతున్న పశు శాఖ సహాయ సంచాలకులు

పశుగణనపై సమీక్ష

ప్రజాశక్తి -కోటవురట్ల:21వ జాతీయ పశు గణన పై మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నరేష్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు సంబంధించిన పశువైద్య సిబ్బంది హాజరయ్యారు. సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు, అదేవిధంగా సిబ్బంది నిరంతరం సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని రైతులకు సలహాలతో పాటు పశువులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణాలతో పాటు ఉపాధి నిధుల నుండి రైతులకు పశుగ్రాసం సాగు విధానం పట్ల అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో గర్భిణి మృతి

వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణం : బంధువుల ఆరోపణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం గర్భిణీ మృతి చెందింది. నవమాసాలు మోసిన బిడ్డతో సహా తన భార్య చనిపోయిందని తెలిసిన భర్త షాక్ కు గురయ్యారు. ఇదే ఆసుపత్రిలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. స్థానికుల కథనం మేరకు రాయవరం మండలం చిన్నగుమ్ములూరు గ్రామంలో కె.నానాజీ, మహబున్నీలు మతాంతర వివాహం చేసుకున్నారు. వీరిద్దరూ ప్రేమ వివాహం చేసుకొని మొదటగా ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చారు. రెండవ కాన్పులో భాగంగా అసుపత్రిలో చికిత్స కోసం వచ్చారు. సోమవారం మధ్యాహ్నం వచ్చిన గర్భిణీ మహబున్నిని వార్డులో ఉంచారు. రాత్రి 12 గంటల సమయంలో డాక్టర్ వచ్చి టాబ్లెట్ ఇచ్చి వెళ్లారు. విపరీతమైన నొప్పులు రావడంతో భరించలేక పోతున్నానని గర్భిణీ ఎంత మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆమె కుటుంబ సభ్యులు అత్త లక్ష్మి తెలిపింది. 3 గంటల ప్రాంతంలో సిబ్బందిని లేపగా డెలివరీ అయిపోతుందని చెప్పి వెళ్లిపోయారని అత్త లక్ష్మి తెలిపింది. ఉదయం 7 గంటల సమయంలో గర్భంలో ఉన్న బిడ్డతో సహా గర్భిణీ మరణించింది. వీరి మరణానికి వైద్య సిబ్బంది, డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని బంధువులు మండిపడ్డారు. డాక్టర్లు మరణానికి కారణాన్ని వివరించే ప్రయత్నం చేసినా బంధువులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. విషయం తెలిసిన పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఇరువురిని వారించి సర్ది చెప్పారు. ఈ

గర్భిణి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సంఘటనపై ఏరియా అసుపత్రి ఇన్చార్జ్ సూపర్డెంట్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించలేదన్నారు. బంధువులు, కుటుంభీకులు చేస్తున్న ఆరోపణలు నిజం కాదని చెప్పారు. గర్భిణీని కాపాడడానికి తీవ్రంగా ప్రయత్నించామని అన్నారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పన సంస్థ, సీడాప్ సంయుక్తంగా ఈనెల 28న శనివారం పాయకరావుపేట శ్రీప్రకాష్ (స్పెసెస్)డిగ్రీ కాలేజీలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లను మంగళవారం నాయకులు, అధికారులు పరిశీలించారు. రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత సారధ్యంలో పాయకరావుపేటలో నిర్వహించే మెగా జాబ్ మెళాను జయప్రదం చేయాలని పాయకరావుపేట టీడీపీ మండల శాఖ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు తెలిపారు. మెగా జాబ్ మేళాలో 50 కంపెనీలు పాల్గొని, 2 వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా, ఐటి కోర్స్‌లో ఉత్తీర్ణత సాధించి 18నుంచి 40 ఏళ్ల నిరుద్యోగ యువత శనివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత naipunyam.ap.gov.in తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటుగా ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లతో జాబ్ మేళాకు రావాలన్నారు. కార్యక్రమంలో సీఐ జి. అప్పన్నబాబు, మండల ఆఫీస్ సూపర్వైజర్ వర్మ, స్పెసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

కుమారుని అదృశ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

రోధిస్తున్న బంధువులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కొయ్యూరు ఏపీఆర్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులు చెందుతున్నారు. ఓ విద్యార్థికి సబంధించిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు తెలియజేయడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి వచ్చారు. ఈ మృతదేహం తమ కుమారుడిది కాదని తల్లిదండ్రులు తెలిపారు. తల్లిదండ్రుల వివరాలు ప్రకారం..అల్లూరి జిల్లా కొయ్యూరులో ఏపీఆర్ ట్రైబల్స్ వెల్ఫేర్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న పాత పాడేరు గ్రామానికి చెందిన విద్యార్థి వంతల మనోజ్ ఈనెల 11వ తేదీన స్కూల్ నుంచి అదృశ్యం అయినట్లుగా కళాశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు 13న సమాచారం అందించారు. సోమవారం ఏపీ ఆర్ ఎస్ స్కూల్ వెనుక భాగం చెరువులో అదే స్కూలు డ్రెస్ తో చనిపోయిన బాలుడు కనిపించడంతో పది రోజుల క్రితం తప్పిపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు మరణించిన బాలుడు మీ అబ్బాయే అని సమాచారాన్ని అందించారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు స్పందిస్తూ బాలుడు తమ కుమారుడు కాదని తెలియజేశారు. తప్పిపోయింది ఆ విద్యార్థే అని పోలీసులు చెబుతుండటంతో మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద తప్పిపోయిన బాలుడు కుటుంబ సభ్యులకు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి పోలీసులకు మధ్య వివాదం నెలకొంది. దీనిపై అప్పట్లోనే పోలీసులకు పిర్యాదు చేశామని తల్లిదండ్రులు తెలిపారు. అప్పట్నుంచి ఒక పక్క పోలీసులు, మరో పక్క విద్యార్థి తల్లిదండ్రులు మనోజ్ కోసం గాలిస్తున్నారు. కొయ్యూరు రెసిడెన్సియల్ స్కూలు సమీపంలో ఉన్న చెరువులో విద్యార్థి మృతదేహం లభ్యమయ్యింది. ఇది మనోజ్ దే అయి ఉంటుందని భావించిన పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీంతో మంగళవారం ఉదయమే ఆస్పత్రికి చేరుకున్న తల్లిదండ్రులు, బంధువులు మృతదేహం తన కుమారిడిది కాదని స్పష్టం చేశారు.

దీనిపై సీఐ వెంకట్రావు మాట్లాడుతూ పది రోజుల క్రితం మనోజ్ తప్పిపోయినట్టు మిస్సింగ్ కేసు నమోదయ్యిందన్నారు. దీని ఆధారంగా మనోజ్ గా భావిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు మనోజ్ కాదని చెప్పడంతో పూర్తిస్థాయిలో గుర్తించి, ఎవరినేది నిర్ధారిస్తామని వెల్లడించారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి
ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నిరసన

నర్సీపట్నం టౌన్: బాధిత విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ మేరకు విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారణమైన అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థి కుటుంబానికి న్యాయం చేసేంతవరకు పోరాటం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గౌతం, నర్సీపట్నం డివిజన్ ప్రెసిడెంట్ భూషణ్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ భార్గవ్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్ రమణ, తరుణ్, సిపిఎం నాయకులు చిరంజీవి పాల్గొన్నారు...

ఆందోళన చేస్తున్న నాయకులు

వినతిపత్రం ఇస్తున్న బాధితురాలు

పింఛన్ పునరుద్ధరించరూ..

ప్రజాశక్తి- కోటవురట్ల: రెవెన్యూ దస్త్రాలలో తన పేరుతో ఉన్న భూమిని తొలగించి సామాజిక భద్రత పించను మంజూరు చేయాలని పి.రామన్నపాలెం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసిల్దారు తిరుమల బాబుకు గ్రామానికి చెందిన చందక లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు...రామన్నపాలెం గ్రామానికి చెందిన ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇద్దరికీ వివాహాలు జరిగి పోవడంతో వారు వెళ్లిపోయారు. 2019 ముందు పది సంవత్సరాలుగా పించను అందుకునే ఆమెకు ప్రస్తుతం పించను అందక ఇబ్బంది పడుతోంది. తన పేరుతో 14 ఎకరాల భూమిని రికార్డుల్లో చూపిస్తుందన్నారు. పించను అందేలేదని సచివాలయం, రెవిన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రికార్డుల్లో భూమి తొలగించలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

ఆధార్ కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో మూడు ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రావికమతం ఎంపీడీవో వెంకన్న బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 26న కొమెర, 27న కన్నంపేట, 28న చీమలపాడు అంగన్వాడి కేంద్రాలలో ఆధార్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ఆయన తెలిపారు.

ప్రతి రోజూ సేవా కార్యక్రమం చేపట్టండి

కలెక్టరేట్ : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మ సంతృప్తితో ఆనందమయ జీవనం గడపాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పిలుపునిచ్చారు. ప్రతి రోజూ ఓ సేవా కార్యక్రమం చేపట్టాలని ఆకాంక్షించారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకులను నిర్వహించారు. వీటికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మహిళా సెక్యూరిటీ గార్డులను దూషించిన..
సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ మహిళా సెక్యూరిటీ గార్డులను అసభ్య పదజాలంతో దూషించిన కెజిహెచ్ సెక్యూరిటీ గార్డ్స్ సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని అడిగిన మహిళా సెక్యూరిటీ గార్డుల పట్ల దురుసుగా, అసభ్యంగా దుర్గాప్రసాద్ వ్యవహరించారన్నారు. ధర్నా అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందను కలిసి పరిస్థితిని వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. బకాయి వేతనాలు చెల్లించే విధంగా పై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. ధర్నాలో సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

ఫార్మా ప్రమాదాల నివారణకు చర్యలేవీ ?

ప్రజాశక్తి - అనకాపల్లి : పరవాడ ఫార్మా సిటీలో వరుసగా రెండు రోజులపాటు రక్షిత్, యాక్టిస్ ఫార్మా కంపెనీల్లో చోటుచేసుకున్న ప్రమాదాల పట్ల సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు రొంగలి రాము, కోశాధికారి వివి.శ్రీనివాసరావు మంగళవారం సిఐటియు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మా కంపెనీలలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం, యాజమాన్యాలు తక్షణ చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెలలోనే ఠాగూర్, విజయ శ్రీ ఆర్గానిక్స్, రక్షిత్, యాక్టిస్ ఫార్మా కంపెనీల్లో వరుస ప్రమాదాలు జరిగాయన్నారు. భద్రతా ప్రమాణాల విషయంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం ఈ ప్రమాదాలతో తేటతెల్లమైందన్నారు. సేఫ్టీ ఆడిట్‌లో తీవ్రమైన లోపాలు ఉన్నట్లుగా వెల్లడవుతోందన్నారు. ఫార్మా సిటీలో కార్మికులకు భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న శంకరరావు

27న పోరుబాటను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఈ నెల 27న కరెంట్ చార్జీల బాదుడుపై వైసీపీ పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గణేష్ మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం 16వేల కోట్ల భారాన్ని వేయడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు(బాబులు), నర్సీపట్నం ఎంపిపి సుర్ల రాజేశ్వరి, నాయకులు తమరాన శ్రీను పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్